
సాక్షి
చిత్తూరు
సోమవారం । 26 । మే । 2025



సౌర కాంతులు

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను అందించనున్నారు. - 8లో



సదా..కనులవిందు

వడమాలపేట మండలానికి సమీపంలో సదాశివ కోన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. - 8లో



టీచర్లు నష్టపోకుండా బదిలీలు..

టీచర్లు నష్టపోకుండా బదిలీలు నిర్వహించాలని వైఎస్సార్ టీచర్ అసోసియేషన్ నేతలు డీఈఓకు విన్నవించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారి పై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

వనసంపదతో పర్యావరణ సమతుల్యత



రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడం అలవాటు చేసుకోవాలని 35వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిస్ అన్నారు. ఆదివారం బెటాలియన్ ఆధ్వర్యంలో నగరంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన సంపదతో పర్యావరణ సమతుల్యత లభిస్తుందన్నారు. క్రమేణా పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం కేడెట్‌లకు మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలు, అటవీ రక్షణ చట్టాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పది రోజుల ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమంలో వెపన్ ట్రైనింగ్, డ్రిల్, ఫిజికల్ ట్రైనింగ్, ఆటల పోటీల్లో గెలుపొందిన కేడెట్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, ధనంజేయులు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా 9 మండలాలు.. 15 గ్రామాల్లోని 34 ఆవాసాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఉందని, దీనిపై తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి తెలిపారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని జీడీ నెల్లూరు, గుడిపాల, ఐరాల, పుంగనూరు, పూతలపట్టు, తవనంపల్లి, యాదమరి మండలాల్లో అధిక ఫ్లోరైడ్ ప్రభావం ఉందన్నారు. బడులు పునఃప్రారంభమైన వెంటనే 11 ఏళ్ల లోపు పిల్లలకు డెంటల్ ఫ్లోరోసిస్, స్కెలిటల్ ఫ్లోరోసిస్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామన్నారు. అలాగే కమ్యూనిటీ సర్వేలో స్కెలిటల్ ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న వారికి నెక్ బెల్ట్, లంబార్ బెల్ట్, వాకింగ్ స్టిక్స్, వాకర్, వీల్ చైర్స్, టాయిలెట్ చైర్స్ వంటి పరికరాలు అందజేస్తామన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో వ్యాధి బారిన పడకుండా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలందరూ సురక్షితమైన తాగునీరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ నాయక్ పాల్గొన్నారు.

యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ




యోగా శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల యోగా కేంద్రంలో యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఆదివారం ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్న ఈ శిక్షణా కార్యక్రమంలో మొదటిరోజు ఆదివారం డీఆర్‌ఓ మోహన్ కుమార్ పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యోగాతో కలిగే ఆరోగ్య లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, యోగా శిక్షకులు యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శిక్షణలో పాల్గొన్న ట్రైనర్లు శిక్షణ అనంతరం ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పీడీలు, పీఈటీలు, యోగా శిక్షకులు మండలస్థాయిలో ప్రతి గ్రామం నుంచి వచ్చే ట్రైనర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ బాలాజీ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, యోగా అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసనాయుడు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కోవిడ్ అలెర్ట్

కోవిడ్ మహమ్మారి మళ్లీ కోరలు చాస్తోంది.. ఇప్పటికే విశాఖ, కడప, చెన్నై, బెంగళూరు నగరాల్లో కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి జిల్లాలకు దేశ వ్యాప్తంగా యాత్రికులు వస్తుంటారు. మిగిలిన జిల్లాలతో పోల్చితే ఈ జిల్లాల్లో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇంకా మేల్కొకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రస్తుతం భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు.



ఆస్పత్రిలోని బెడ్లు (ఫైల్)

- జిల్లా సరిహద్దుల్లో కరోనా కేసులు
- ముందస్తు జాగ్రత్తలకు ప్రభుత్వం ఆదేశం
- అప్రమత్తం కానీ అధికారులు
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో మళ్లీ కరోనా అలజడి మొదలైంది. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కరోనా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించింది. ముఖ్యంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు తప్పనిసరిగా వాడాలని పేర్కొంది. అయితే ఆస్పత్రుల్లో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. కనీస ఏర్పాట్లు కరువయ్యాయి. ఆస్పత్రి అధికారుల్లో నిర్లిప్తత నెలకొంది.

జిల్లాను కరోనా ఫీవర్ పట్టుకుంది. నిత్యం వేలాదిగా తిరుపతి వెళ్లేందుకు భక్తులు చిత్తూరు మీదుగానే వెళుతుంటారు. ఇదే మాదిరిగానే కాణిపాకంకు వేలాదిగా యాత్రికులు తరలివస్తుంటారు. దీనికితోడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు జిల్లా సరిహద్దులోనే ఉంది. స్వామి దర్శనంతో పాటు వివిధ పనుల నిమిత్తం రోజువారీగా సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లాకు రాకపోకలు చేస్తున్నారు. ఈ తరుణంలో జిల్లాకు కరోనా ముప్పు పొంచి ఉందని పలువురు భావిస్తున్నారు.

గతంలో సుమారు 2 వేల మంది మృతి

2019లో కరోనా కల్లోలం ఉమ్మడి జిల్లా నుంచే మొదలైన సంగతి అందరికీ తెలిసిందే..అప్పట్లో తొలి కేసు శ్రీకాళహస్తీలో నమోదు కాగా ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కరోనా బెల్ మోగింది. ఇలా 2019 నుంచి 2021 వరకు మూడు దశల్లో కరోనా విజృంభించగా... ఇందులో వేల మంది మృతి చెందిన వారు లేకపోలేదు. కరోనా మూలంగా ఉమ్మడి జిల్లాలో అప్పట్లో సుమారు 2 వేల మందికి పైగా మృతి చెందారు. దీంతో రాష్ట్రంలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో తిరిగి వైద్య ఆరోగ్యశాఖలో ఆందోళన మొదలైంది.

పెరుగుతున్న కొత్త వేరియంట్లు

కోవిడ్-19 వైరస్ కొత్త వేరియంట్లు, ముఖ్యంగా ఒమిక్రాన్ ఉప-వేరియంట్లు, ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వేరియంట్లలో కోవిడ్ 8.1.3.1.1 వంటి వేరియంట్ల గురించి చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ, ఇతర ఆరోగ్య సంస్థల నివేదికల ప్రకారం, ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఉప-వేరియంట్ ఎక్కువగా వ్యాపిస్తోంది. అమెరికాలో 70 శాతం కోవిడ్ కేసులు. యూకేలో 60 శాతం కేసులు, ఆస్ట్రేలియాలో మూడో అత్యంత ప్రబలమైన వేరియంట్.8.1 ఉంది. ఇతర రాష్ట్రాల్లోనూ కోవిడ్ కేసులు పెరుగుతుంటడంతో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

లక్షణాలు ఇవీ..

జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. ఆరోగ్యశాఖకు చెందిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌ల్లో మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని ఆదేశించింది. వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేశారు. ఆరోగ్యశాఖ అన్ని పరీక్ష సౌకర్యాలతో కూడిన 24 గంటలు పనిచేసే ల్యాబ్‌లో మాస్కును పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులు తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. రెండున్నర సంవత్సరాల విరామం తర్వాత దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. చెన్నై, కర్ణాటక రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. రోగులు తేలికపాటి ఒత్తిడితో బాధ పడుతున్నట్లు గుర్తించారు.

కనిపించని ముందస్తు చర్యలు

జిల్లాకు కరోనా వ్యాప్తి పొంచి ఉంది. జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనే ఉన్నాయి. అక్కడ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దీనికితోడు ఆ రాష్ట్రాల నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన ఆస్పత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కరోనాకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిన ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బెడ్లు, ఆక్సిజన్ , వెంటిలేటర్లు , పరీక్ష కిట్లు తదితర ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోవిడ్‌కోసం ప్రత్యేక బెడ్లు కేటాయించడంలో అలసత్వం చూపుతున్నారు. దీని బట్టిచూస్తే జిల్లాకు కరోనా ముప్పు తప్పేలా లేదని ఆస్పత్రి వర్గాలే చెబుతున్నాయి. గతంలో కరోనా అంటేనే ఆస్పత్రుల్లో చకచకా ముందస్తు ఏర్పాట్లు జరిగేవి. ప్రణాళిక ప్రకారం బెడ్లు కేటాయింపు జరిగేవి. పరీక్షల కోసం కిట్లు అందుబాటులోకి తెచ్చేవారు. సీఎం చంద్రబాబు జిల్లాలోనే ఇంత నిర్లక్ష్యం ఉంటే..మిగతా జిల్లాల పరిస్థితి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోవిడ్‌కు ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం



కోవిడ్‌కు సంబంధించి మూడు రోజులకు ముందు ఎలాంటి ఆదేశాలు రాలేదు. శనివారం ఆదేశాలు వచ్చాయి. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తాం. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అన్ని ఆస్పత్రులకు ఆదేశాలిస్తాం. బెడ్లు కేటాయిస్తాం. వారికి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

– పద్మాంజలి దేవి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

భయపడాల్సిన పనిలేదు



కొత్త వేరియంట్‌కు భయపడాల్సిన పనిలేదు. అలా అని నిర్లక్ష్యంగా ఉండకూడదు. తగిన జాగ్రత్తలతో బయటకు రావాలి. కోవిడ్ నియమ నిబంధనలు పాటించాలి. వృద్ధులు, చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కోవిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికెళ్లి పరీక్షలు చేయించుకోండి. నిర్లక్ష్యం లేకుండా కోవిడ్ జాగ్రత్తలు పాటించాలి.

– సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

పార్టీకి ద్రోహం చేసి నీతులా?

– ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యలపై వెంకటేగౌడ ఫైర్



వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

పలమనేరు : ఉండవల్లి శ్రీదేవి పార్టీకి వెన్నుపోటు పొడిచి శుద్దపూసలా నీతులు వల్లించడం సరికాదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటేగౌడ విమర్శించారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాడికొండలో కొత్త అభ్యర్థిగా ఆమె గెలవడం కేవలం పార్టీని చూసేగాని ఆమెను చూసి కాదన్నారు. వైఎస్సార్‌సీపీలో ముందుగా పార్టీకి ద్రోహం చేసిన వాళ్లంతా నేడు మైకుల్లో సొంత పార్టీని విమర్శించడం చూస్తుంటే రేపు వీరు కూటమి నేతలను విమర్శించరనే గ్యారెంటీ ఏంటని ప్రశ్నించారు. మహానాడు కోసం పలమనేరుకు వచ్చిన ఉండవల్లి శ్రీదేవికి కనీసం పలమనేరు పేరు తెలియకుండా ఇదే ఊరు అనడంతోనే ఆమె కథ అందరికీ అర్థమైందన్నారు. పింఛన్ల పెంపుపై నాడు అధినేత తప్పు చేశారని చెప్పిన ఆమె అప్పుడే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. 2024 ఎన్నికల్లో తనకు టికెట్ దక్కదని తెలిసే వైఎస్సార్‌సీపీని వీడి కూటమిలో కలిశారని అది ఆమె స్వార్థం కాదా అని ప్రశ్నించారు. మొన్నటి దాకా వైఎస్సార్‌సీపీ పాలన బాగుందని కితాబిచ్చిన మీరు విధిలేక కూటమి పాలనను మెచ్చుకుంటున్నారనే విషయం టీడీపీ కార్యకర్తలకు సైతం బాగా అర్థమైందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను పట్టించుకోని చంద్రబాబును నిలదీయాల్సిందిపోయి వైఎస్సార్‌సీపీపై అవాకులు, చవాకులు మాట్లాడడం మంచిది కాదన్నారు. కడపలో జరిగే మహానాడును విజయవంతం చేసేందుకు వచ్చిన ఆమె దాన్ని చూడాలి గానీ మీకు రాజకీయ భిక్ష పెట్టిన జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారన్నారు.

గంగమ్మా.. దీవించమ్మా



అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోయకొండలో ఎటుచూసినా జన సంద్రంగా మారింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పులిచెర్ల మండలాన్ని మదనపల్లెలో కలపొద్దు

- చిత్తూరు లేక తిరుపతి కావాలి
- టీడీపీ మండల నాయకుల డిమాండ్



రాయవారిపల్లె రామనాథం నాయుడు ఇంటిలో సమావేశమైన టీడీపీ నేతలు

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలపవద్దని సమీపంలోని చిత్తూరులేక తిరుపతి డివిజన్‌లోనే ఉంచాలని టీడీపీ మండల నాయకులు రాయవారిపల్లెలోని టీడీపీ నేత రామనాథం నాయుడు ఇంటిలో సమావేశమయ్యారు. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్తూరు కాని 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి రెవెన్యూ డివిజన్‌లోనే మండలాన్ని ఉంచాలని కోరారు. గతంలో పులిచెర్ల మండలం తిరుపతి డివిజన్‌లో ఉండేదని ఇప్పుడు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న మదనపల్లె డివిజన్‌లో కలపడం ఇష్టం లేదని దీనిపై ప్రభుత్వం, కలెక్టరుకు రాత పూర్వకంగా అభ్యంతరాలను తెలియజేస్తామన్నారు. ఒకప్పుడు పులిచెర్ల సమితి ఉండేదని ఈ సమితిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజకీయ జన్మనిచ్చిందన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రజల సౌకర్యం కోసం ఈ మండలాన్ని చిత్తూరు లేక తిరుపతి డివిజన్‌లో కలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతామని తెలిపారు. ఈ విషయంలో కలెక్టరును కూడా కలిసి రాత పూర్వకంగా అందరూ టీడీపీ నాయకులు విన్నవిస్తామన్నారు.

'ఇంటర్'లో బదిలీల కుదుపు



మేనేజ్‌మెంట్ల వారీగా కళాశాలలు ఇలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
హైస్కూల్ ప్లస్	24
కేజీబీవీ	08
సోషల్ వెల్ఫేర్ గురుకులాలు	04
బీసీ వెల్ఫేర్ గురుకులాలు	01
ఏపీ మోడల్ స్కూల్స్	07
మొత్తం కళాశాలలు	75

- జిల్లాలో దాదాపు 468కి పైగా స్థానచలనం
- జూన్ 8 దాకా బదిలీల ప్రక్రియ నిర్వహణ
- కసరత్తు చేస్తున్న ఇంటర్మీడియట్ అధికారులు
- బదిలీల అనంతరమే ఒప్పంద అధ్యాపకులకు పోస్టింగులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ విద్యాశాఖలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీలు షురూ అయ్యాయి. ఉద్యోగుల బదిలీల షెడ్యూల్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో జూన్ 8వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రిన్సిపల్స్, జూనియర్ లెక్చరర్లు, వారి పనితీరు ఆధారంగా పాయింట్‌లను కేటాయించనున్నారు. ఒక కళాశాలలో అయిదేళ్లు ఒకేచోట పనిచేసిన ప్రిన్సిపల్స్, జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. రెండేళ్లు పూర్తయిన సిబ్బంది రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు జిల్లాలో 468 కి పైగా ప్రిన్సిపల్స్, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి స్థానచలనం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

31న బదిలీ పోస్టింగులు

బదిలీల షెడ్యూల్ మేరకు ఆదివారం అభ్యంతరాలు పరిశీలన చేసి, తుది జాబితాను విడుదల చేయనున్నారు. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఖాళీల ప్రకటన, వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం కల్పించి ఈనెల 31న పోస్టింగ్‌లను కేటాయింపు చేస్తారు. బదిలీలకు అర్హులైన అభ్యర్థుల జాబితాను ఇప్పటికే పోర్టల్‌లో ప్రకటించారు. అధికారులు ధ్రువీకరణ చేసిన జాబితాలో ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో తమ ఎంపికలను నమోదు చేయాల్సి ఉంటుంది. పోస్టింగ్ ఆర్డర్స్ సైతం ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకుని తమకు కేటాయించిన స్థానాల్లో చేరాలని అధికారులు చెబుతున్నారు.

పాయింట్ల కేటాయింపు ఇలా..

బదిలీల్లో ప్రిన్సిపల్స్, జూనియర్ లెక్చరర్లకు పాయింట్లు కేటాయించనున్నారు. 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉన్న కేటగిరీ–ఏ ఉంటే ఏడాదికి 2 పాయింట్లు, 12 శాతం హెచ్‌ఆర్‌ఏలో పనిచేస్తుంటే ఏడాదికి 4 పాయింట్లు, 10 శాతంలో పనిచేస్తున్న జేఎల్ లకు ఏడాదికి 6 పాయింట్లు ఇస్తారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తుంటే ఏడాదికి 8 పాయింట్లు కేటాయిస్తారు. వీరి పనితీరును బట్టి బదిలీల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. అలాగే జూనియర్ లెక్చరర్లకు ఆయా సబ్జెక్టుల్లో ఇంటర్ ఫలితాల్లో 40 శాతం ఉత్తీర్ణులైతే ఎలాంటి పాయింట్లు ఉండవు. 41–60 శాతం వరకు అయితే 2 పాయింట్లు, 61–80 శాతం వరకు 4 పాయింట్లు, 81–100 శాతానికి 6 పాయింట్లు కేటాయిస్తారు. అలాగే ప్రిన్సిపల్స్‌కు పాయింట్లు కేటాయించనున్నారు. జిల్లాలో 75 అన్ని యాజమాన్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో అధ్యాపకులు, సిబ్బంది కలిపి 500 కు పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి అయిన వారికి కచ్చితమైన బదిలీ జరగనుంది. రెగ్యులర్ బదిలీల తర్వాత కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఖాళీల ఆధారంగా పోస్టులను కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

తప్పనిసరిగా స్థాన చలనం

వెబ్ కౌన్సెలింగ్‌లో నిర్వహించే ఈ ప్రక్రియలో బదిలీల ఉత్తర్వులను జూన్ 8వ తేదీ లోగా జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2025 మే 31 నాటికి ఒకే కేంద్రంలో ఐదేళ్లు పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని, రెండేళ్లు పూర్తయిన వారు రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 2027 మే 31వ తేదీ లోపు ఉద్యోగ విరమణ పొందే వారికి బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు.

పకడ్బందీగా బదిలీలు చేపడుతున్నాం



రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారుల ఉత్తర్వుల మేరకు బదిలీల ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నాం. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. షెడ్యూల్ మేరకు అందిన అభ్యంతరాలను పకడ్బందీగా పరిశీలించి ఆదివారం తుది జాబితాను విడుదల చేస్తున్నాం. బదిలీల్లో ఎవరైన నిబంధనలను అతిక్రమించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– డా.ఆదూరు శ్రీనివాసులు, ఆర్జేడీ, డీఐఈఓ (ఇంటర్మీడియట్), చిత్తూరు

సూర్య, చంద్రప్రభలపై వేణుగోపాలుడు



చంద్ర ప్రభపై విహరిస్తున్న స్వామి

కార్వేటినగరం : రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సంతాన వేణుగోపాలుడు పశుపాలకుడైన శ్రీకృష్ణునిగా .. జీవకోటికి వెలుగును ప్రసాదించే దినకరుడిపై విహరించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. సూర్యప్రభ వాహనంపై స్వర్ణాభరాలు, పట్టుపీతాంబరాలతో శ్రీకృష్ణునిగా భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షారాబ్ బాబు సురేష్ ,కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘాట్ రోడ్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వస్తున్న శ్రీవారి భక్తులు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కర్నాటకకు చెందిన భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఒకటో మలుపు వద్ద కారు కొండను ఢీంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తుల్లో ఇద్దరికి చిన్నపాటి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కుంకీలతో భీ'కరి' కట్టడి



సూచనలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్‌నాయక్

తిరుపతి మంగళం : అటవీ ప్రాంతంలో నుంచి బయటకు వస్తున్న మద గజాలను కుంకీ ఏనుగులతో కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ ఆదేశించారు. ఆదివారం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలోని ఎలిఫెంట్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పలమనేరులోని క్యాంపుతో పాటు జూ పార్కును కూడా కుంకి ఏనుగుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన ఏనుగులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. గజ దాడులలో ఒక్కరు కూడా మృత్యువాత పడకుండా, పంట పొలాలు నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జూ పార్క్ లోని వన్యప్రాణుల స్థావరంలో పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. అనంతరం జంతువుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. జూలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి సీఎఫ్ సెల్వం, అనంతపురం సీఎఫ్ యశోదాబాయి పాల్గొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, శ్రీపద్మావతి కళాశాల్లోని పరీక్ష కేంద్రాలను స్టేట్ అబ్జర్వర్, జిల్లా ప్రతేక అధికారి కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ ఎస్‌జీ అజ్మీరా, డీఆర్‌ఓ నరసింహులుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం ఉదయం నిర్వహించిన పరీక్షకు 5,261 మందికి గాను 2,941 మంది అభ్యర్థులు హాజరైనట్లు వెల్లడించారు. 2,320 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 5,261 మందికి గాను 2,929 మంది హాజరైనట్లు తెలిపారు. 2,332 మంది గైర్హాజరైనట్లు వివరించారు. అభ్యర్థులు ఏమాత్రం ఇబ్బంది పడకుండా పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు.

సౌర కాంతులు



సోలార్ ప్యానళ్లు

పీఎం సూర్యఘర్ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వరంగా మారింది. ఇంటి పైకప్పు (సిమెంట్ శ్లాబ్) లేని పేదల కోసం ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రతి సర్వీసు దారుడికి నెలకు 200 యూనిట్ల సౌర విద్యుత్‌ను అందించనున్నారు. మిగులు విద్యుత్‌ను ప్రధాన రెగ్యులర్ విద్యుత్ లైన్‌కు అనుసంధానం చేసే సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ట్రాన్స్‌కో అధికారులు సమాయత్తం అయ్యారు. ఇందులో భాగంగా భూసేకరణకు రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాల ఎంపికకు రంగంలోకి దిగారు. ఈ కసరత్తు పూర్తయితే ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో సౌర కాంతులు విరజిమ్మనున్నాయి.

- ప్రభుత్వ స్థలంలో సోలార్ ప్లాంట్స్
- ఎస్సీ, ఎస్టీ సర్వీసులకు ఏర్పాటు
- జిల్లాలో 48 వేల కుటుంబాలు గుర్తింపు
- 384 ఎకరాలు అవసరమని అంచనా

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఉచిత విద్యుత్తు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ట్రాన్స్‌కో తీపికబురు అందించింది. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు సంకల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో అధిక సంఖ్యలో రూఫ్‌టాప్ (శ్లాబు) లేని ఇళ్లు ఉండటంతో పథకం అమలు కష్టతరంగా మారింది. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 86 వేల సర్వీసులు ఉండగా అందులో 55 శాతం అంటే 48 వేల కుటుంబాలకు రూఫ్‌టాప్ లేదని గుర్తించారు. వారికి ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు ఏర్పాటు

జిల్లాలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం పొందుతున్న ఎస్సీ, ఎస్టీ సర్వీసులు మొత్తం 86,000 ఉన్నాయి. ఇందులో 48,000 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూఫ్‌టాప్ లేన్నట్లు క్షేత్రస్థాయిలో సిబ్బంది సర్వే చేసి గుర్తించారు. వీరందరికీ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలంటే 384 ఎకరాల ప్రభుత్వ స్థలాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. అక్కడ 96 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచించారు.

విద్యుత్ లైన్‌కు అనుసంధానం

సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడానికి క్షేత్రస్థాయిలో సిబ్బంది సర్వే చేశారు. అందులో కొన్ని ప్రాంతాల్లో శ్లాబు లేకుండా గుడిసె, పెంకుటిల్లు ఉన్నట్లుగా గుర్తించారు. సంబంధిత ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి అక్కడ ప్లాంట్లను నెలకొల్పనున్నారు. వీటి ఏర్పాటుకు మొత్తం 384 ఎకరాల ప్రభుత్వ స్థలాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. అంత స్థలం దొరకని పక్షంలో కనీసం 100 ఎకరాల లోపు వీటిని బిగించే విధంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రచించారు. స్థలాన్ని గుర్తించిన తరువాత అక్కడ ప్లాంట్‌ను పెట్టి విద్యుత్ లైన్‌కు అనుసంధానం చేయనున్నారు. ప్రతి సర్వీసుదారుడికి నెలకు 200 యూనిట్లు వీటి ద్వారా ఇవ్వనున్నారు. 48 వేల సర్వీసులకు 2 కిలో వాట్ల చొప్పున మొత్తం 96 మెగావాట్ల (96 వేల కిలోవాట్ల) సరఫరాను అందించనున్నారు. అంటే రోజు 5.28 లక్షల యూనిట్ల చొప్పున నెలకు 1.58 కోట్ల యూనిట్లు ఇవ్వనున్నారు. 1 మెగావాట్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు 4 ఎకరాల స్థలం అవసరం కాగా ఆ లెక్కన 96 మెగావాట్లకు 384 ఎకరాల ప్రభుత్వ స్థలం అవసరం. జిల్లాలో విరివిగా ప్రభుత్వ, గ్రామకంఠం స్థలాలు ఉన్నాయి. 38,000 సర్వీసులకు రూఫ్‌టాప్‌లు ఉన్నాయి. ఆ లెక్కన సంబంధిత నివాసాలపై 76,000 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా రోజు 3.96 లక్షల యూనిట్లు నెలకు 1.18 కోట్ల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కానుంది.

భూసేకరణకు చర్యలు

ప్లాంట్ల ఏర్పాటు కోసం సిబ్బంది క్షేత్రస్థాయిలో స్థలాల అన్వేషణ మొదలుపెట్టనున్నారు. ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠ భూములను గుర్తించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. విద్యుత్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమన్వయంతో భూసేకరణకు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాలో రూఫ్‌టాప్ లేని ఇళ్లు ఉన్న ఒక్కో కుటుంబానికి రెండు కిలోవాట్ల సామర్థ్యంతో సరఫరా ఇవ్వనున్నారు.



ప్రభుత్వ భూమి

జిల్లా సమాచారం	
జిల్లాలోని ఉచిత ఎస్సీ, ఎస్టీ సర్వీసులు	86,000
సర్వీసుకు ఇవ్వనున్న సామర్థ్యం	2 (కిలోవాట్లు)
రూఫ్‌టాప్ లేని సర్వీసులు	48,000
లబ్ధిదారులకు మొత్తం ఇవ్వనున్న విద్యుత్	96,000 (కిలోవాట్ల సామర్థ్యం)
అవసరమైన ప్రభుత్వ స్థలం అంచనా	384 ఎకరాలు

"సర్వే చేస్తున్నాం



ఇంటి శ్లాబ్ లేని ఎస్సీ, ఎస్టీ సర్వీసులను గుర్తించాం. ప్రభుత్వ స్థలం గుర్తింపునకు సిబ్బంది సర్వే చేయనున్నారు. ఈ పనులు పూర్తయ్యాక అక్కడ సోలార్ ప్యానళ్లు పెట్టనున్నాం. అంత స్థలం దొరక్కపోతే ప్యానళ్ల సైజు తగ్గించి 100 ఎకరాల్లో పెట్టే అవకాశం ఉంది. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను లైన్‌కు అనుసంధానం చేసి సరఫరా చేయనున్నాం.

– ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో

రూ.2 లక్షలు ఇస్తే ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం !

- ఎంపీడీఓ టీడీపీ నేతలా వ్యవహారం
- జనసేన మండల అధ్యక్షుడి ఆవేదన

శ్రీరంగరాజపురం : రూ.2 లక్షలు లంచం ఇస్తే ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం గ్యారంటీ అని జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి సోషల్ మీడియా ద్వారా తన ఆవేదనను వ్యక్తం చేశారు. వివరాలు ఇలా మండలంలో ఎగువకమ్మకండ్రిగ పంచాయతీలోని బలిజ సామాజిక వర్గానికి చెందిన వెంకటేష్ 2016 సంవత్సరం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడుకి 23 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘ మిత్రల నుంచి రూ.10 లక్షల ముడుపులు ముట్టాయని ఆయన ఆరోపించారు. వెంకటేష్‌పై ఉపాధి పీడీ రవికుమార్ విచారించి వెంకటేష్ ఎటువంటి తప్పు చేయలేదని క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. అయితే రాజకీయ ప్రోద్బలంతో ఎటువంటి కారణం చూపకుండా ఎంపీడీఓ మోహన్‌మురళి ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్‌ను విధుల నుంచి తొలగించారన్నారు. దీనిపై వెంకటేష్ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు వెంకటేష్‌కు అనుకూలంగా స్టే ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంకటేష్‌ను విధుల్లోకి చేర్చుకోవాలని ఉత్తర్వులు ఇచ్చినా ఎంపీడీఓ విధుల్లోకి చేర్చుకోలేదన్నారు. టీడీపీ నాయకుడిలా ఎంపీడీఓ వ్యవహరిస్తున్నారని మండల జనసేన అధ్యక్షుడు ఆరోపించారు. మండలంలో అవినీతి రాజ్యమేలుతోందని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా వెంకటేష్‌ను విధుల్లోకి చేర్చుకోకపోతే మండల కార్యాలయం ముందు జనసైనికులు ,గ్రామస్తులతో కలసి ధర్నా నిర్వహిస్తారని తెలిపారు.

బదిలీలకు అడ్డదారులు

ఉద్యోగుల బదిలీల్లో కొన్ని ఉద్యోగుల సంఘాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. క్యాష్, పలుకుబడి ఉన్న వారికి సంఘాల్లో ఆఫీస్ బేరర్స్‌గా చేర్చుకుని సిఫార్సు లేఖలు అందజేస్తున్నారు. మరికొన్ని సంఘాలు ముడుపులు స్వీకరించి సిఫార్సు లేఖలు ఇస్తున్నట్లు సమాచారం. కొందరు ఉద్యోగులు అడ్డదారులు తొక్కి ఉన్నచోటే కొనసాగేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

- నిబంధనలను నీరు గార్చే ప్రయత్నాలు
- అడ్డదారులు తొక్కుతున్న కొన్ని ఉద్యోగ సంఘాలు
- సంఘాల్లో కొత్తవారికి అవకాశాలు, సిఫార్సు లేఖలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జీవోలో ఉన్న మినహాయింపులను అవకాశంగా మార్చుకుని కొందరు ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంఘంలో సభ్యత్వం లేనివారికి, ఓటరు జాబితాలో పేరు లేని వారికి రాత్రికి రాత్రే ఆఫీస్ బేరర్లుగా నియామక పత్రాలు ఇచ్చి బదిలీల నిబంధనలను అతిక్రమిస్తున్నారు.

మినహాయింపులకు సిఫార్సు లేఖలు

జిల్లా పరిధిలోని రెవెన్యూ, వ్యవసాయ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ, ఇరిగేషన్, జిల్లా పరిషత్, పే అండ్ అకౌంట్స్, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు 5 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారు బదిలీల్లో స్థానచలనం పొందాల్సి ఉంటుంది. అయితే వారు అడ్డదారుల్లో ఆఫీస్ బేరర్‌లుగా ధ్రువపత్రాలు పొంది బదిలీల నుంచి మినహాయింపులు కోరుతున్నారు. రెవెన్యూ శాఖలో ఆఫీస్ బేరర్ పత్రాలతో పాటు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సమర్పిస్తున్నారు. వీఆర్వోలు తమ స్థానాలను కొనసాగించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.



ఉన్నతాధికారులకు కుచ్చుటోపీ

నిబంధనల ప్రకారం ఒక సంఘంలో ఎవరెవరికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారో ఆ వివరాలతో పాటు ఎన్నికల అధికారి ధ్రువీకరించిన జిల్లా కార్యవర్గ లేఖను కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుత సాధారణ బదిలీల ప్రక్రియలో ఆయా సంఘాల అధ్యక్షులు.. ఉద్యోగులకు వ్యక్తిగతంగా ఆఫీస్ బేరర్ పత్రాలు ఇచ్చేస్తున్నారు. తమ సంఘం తరపున ఎంత మందికి లేఖలిచ్చారో ఆ విషయాలకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన లేఖలను కలెక్టర్‌కు ఇవ్వకుండా కుచ్చుటోపీ పెడుతున్నారు. ఆయా ఉద్యోగ సంఘాలు ఇస్తున్న లేఖలను కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి సమగ్ర విచారణ చేయించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

సంఘాల్లో పేర్లు మార్చేస్తూ..



గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఆఫీస్ బేరర్లకు మూడు పర్యాయాలు పూర్తయ్యే వరకు లేదా ఒకే స్టేషన్‌లో తొమ్మిదేళ్లు పూర్తయ్యే దాకా బదిలీ చేయకూడదు. తాలూకా, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల వివరాలను కలెక్టర్ ద్వారా హెచ్‌వోడీకి పంపాల్సి ఉంటుంది. ఒక సంఘంలో 13 నుంచి 15 లేదా 20 మంది వరకు ఆఫీస్ బేరర్లు ఉంటారు. అందులో ఐదుగురికి మించి ఉద్యోగులు ఐదేళ్లు, తొమ్మిదేళ్లకు పైబడి సర్వీసు పూర్తి చేసిన వారు ఉండరు.. కాగా మొత్తం కార్యవర్గంలో 75 శాతం మందికి బదిలీల నుంచి మినహాయింపులు ఇవ్వాలని కోరుతూ ఆయా సంఘాల పత్రాలు ఇస్తున్నారు. రాత్రికి రాత్రే గుర్తింపు పొందిన సంఘాల్లో సభ్యుల పేర్లను మార్చేసి కలెక్టర్‌కు నివేదికలు ఇస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

టీచర్లు నష్టపోకుండా బదిలీలు నిర్వహించాలి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు నష్టపోకుండా బదిలీలు నిర్వహించాలని వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆదివారం డీఈఓ వరలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంగవైకల్యం పర్సంటేజీని తప్పనిసరిగా సర్టిఫికెట్‌లో ఉండాలనే నిబంధన అమలు చేయాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో 8 అపోర్స్‌మెంట్ పోస్టు బదిలీ అయితే అక్కడ పనిచేసే పురుష టీచర్లను షరతులు లేకుండా బదిలీ చేయాలన్నారు. పాయింట్ల కేటాయింపులో ఎంఈవోలు కొందరు ఒకే రకమైన కేటగిరీకి ఎక్కువ, కొందరికి తక్కువగా పాయింట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎంఈవోల పై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయకాంతన్ మాట్లాడుతూ.. తొలుత ఎస్జీటీగా ఉండి మరో డీఎస్సీలో ఎస్ఏ గా ఎంపికైన వారికి ఎస్జీటీ సర్వీస్ ను పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. 40 ఏళ్లు పైబడిన అవివాహితులకు కేటాయించిన 5 పాయింట్లు రావడం లేదన్నారు. 48 ఏళ్లుగా ఇన్‌సర్వీస్ ఎస్సీ, ఎస్టీ టీచర్లకు కల్పించిన ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని నీరుగారుస్తున్నారన్నారు. రద్దయిన యూపీ పాఠశాలల్లో రెండేళ్లలోపు సర్వీస్ ఉన్న వారి దరఖాస్తులు ఓపెన్ కావడం లేదన్నారు.

పీజీసెట్‌కు 25,688 మంది దరఖాస్తు

- ముగిసిన ఏపీ పీజీసెట్ దరఖాస్తుల గడువు
- కెమికల్, లైఫ్ సైన్స్ కోర్సుల వైపు మొగ్గు
- 30 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- గత ఏడాది కంటే 7 వేలు తగ్గిన వైనం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీపీజీసెట్–2025 దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. అపరాధ రుసుముతో ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో ఏపీ పీజీ సెట్‌కు 25,688 దరఖాస్తులు అందినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. 9వ తేదీ నుంచి పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 30 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సుమారు 153 పీజీ కోర్సులలో ప్రవేశాలకు 31 పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలలో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఏపీపీజీసెట్ పరీక్షకు హాజరుకానున్నారు.

తగ్గిన దరఖాస్తులు

గత ఏడాది పీజీసెట్‌కు 32 వేలకు పైగా దరఖాస్తులు రాగా ఈ ఏడాది అందులో 7వేలు తగ్గడం గమనార్హం. 153 కోర్సులలో సుమారు 25 వేల సీట్లు ఉండగా 25,688 దరఖాస్తులు రావడంతో పీజీ కోర్సులలో ప్రస్తుతం ఉన్న సీట్లకు... అందిన దరఖాస్తులతో పోలిస్తే కాంపిటేషన్ 1 : 1గా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ ఏడాది పీజీసెట్‌కు దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి పీజీ సీటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఏపీ పీజీ సెట్‌కు దరఖాస్తుల వివరాలు

కోర్సు	అందిన దరఖాస్తులు
కెమికల్ సైన్స్	6,070
లైఫ్ సైన్స్	4,027
కంప్యూటర్	2,333
కామర్స్	1,438
ఇంగ్లిష్	898
హ్యుమానిటీస్	883
జువాలజీ	1,548
గణితం	1,175
ఫిజిక్స్	938
బాటనీ	1295
మిగిలిన అన్ని కోర్సులకు	5,083

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ అర్జున్‌బహుదూర్

గుడిపాల: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆదివారం నేపాల్‌కు చెందిన అర్జున్‌బహుదూర్(39) గుడిపాల మండలం 197రామాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్లో నుంచి నిద్రమత్తులో జారి కింద పడ్డాడు. స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 ఈఎంటీ బద్రి, పైలట్ బాబి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అర్జున్ బహదూర్ తలకు బలమైన గాయం తగిలినట్లు తెలిపారు. అనంతరం చిత్తూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.

బ్యానర్లు చించేశారని తమ్ముళ్ల ఆందోళన

- గంటల తరబడి రోడ్డుపై బైఠాయింపు
- ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు పడ్డ ప్రయాణికులు



తమ్ముళ్లు రోడ్డెక్కడంతో నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

చౌడేపల్లె : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన తెలుగు దేశం పార్టీకి చెందిన బ్యానర్లు ఎవరో చింపేశారని తమ్ముళ్లు ఆదివారం రాత్రి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఇటీవల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండల పర్యటనలో భాగంగా ఆ పార్టీ నాయకులు బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని ఎవరో చింపివేశారని న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. రోడ్డుపై వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకొన్న ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని నాయకులకు సర్దిచెప్పడానికి యత్నించినా ఆయన మాటలను ఖాతరు చేయకుండా హంగామా చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

'సదా'..కనులవిందు



ఆకట్టుకునే జలపాతం

ఎత్తైన కొండలు.. పచ్చని పచ్చిక బయళ్లు...కొండలను తాకుతున్న మబ్బులు...కొండల నుంచి జాలువారే జలపాతాల అందాలు కంటికి కనువిందు చేసే చిత్రాలు ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న వడమాలపేట మండలం సదాశివకోనను మనం చూసొద్దాం రండి.

- ఆహ్లాదం పంచే సదాశివ కోన
- ఆకట్టుకునే జలపాతం
- పెరుగుతున్న పర్యాటకులు
- సెలవుల్లో సరిహద్దు నుంచి వస్తున్న సందర్శకులు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సదాశివకోన ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉద్యోగాలు, వ్యాపారాలతో నిత్యం బిజీబిజీగా గడిపే వారు సరదాగా ఓ రోజు కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్క జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రధానంగా వీకెండ్‌లో సుమారు 2 వేల మందికిపైగా యువతీ, యువకులు సదాశివకోన చెంత సేద తీరుతున్నారు. కొండల మధ్య పెద్ద వృక్షాలు, చెట్లు దాటుకొంటూ యువకులు సదాశివ కోన చేరుకొని అక్కడే వంట చేసుకుని విందు, వినోదాలతో సందడి చేస్తున్నారు.

వాగునీటిలో జలకాలాట

సదాశివేశ్వరుడు ఆలయం సమీపంలో జలపాతం ఉంది. అక్కడికి వెళ్లే ప్రతి పర్యాటకుడు వాగులో స్నానం చేసి పక్కనే ఉన్న శ్రీ కామేశ్వరి సమేత శివుడిని దర్శించుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఆ వాగులో స్నానాలు చేసి ఆనందిస్తుంటారు. అనంతరం జలపాతం సమీపంలో వంట చేసుకొని విందు వినోదాలతో సందడి చేసి సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఇళ్లకు చేరుకుంటారు.

వసతులు ఏర్పాటు చేస్తే..

సదాశివకోన శివ భక్తులకే కాకుండా పర్యాటకులకు ఎంతో ముఖ్యమైంది. అయితే ఇక్కడికి వచ్చే పర్యాటకులకు వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏడాదికి రూ.12 నుంచి 15 లక్షల వరకు ఆదాయం వస్తున్నా దేవాదాయశాఖ వసతులు ఏర్పాటు చేయడంలో శ్రద్ధ చూపడంలేదు. భక్తులు, పర్యాటకులకు అవసరమైన విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తే సందర్శకులు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఎలా చేరుకోవాలంటే..

సదాశివకోన చేరుకోవడానికి యాత్రికులకు నాలుగు దారులు ఉన్నాయి. వడమాలపేట టోల్‌గేట్‌కు 500 మీటర్ల దూరంలో టీటీడీ లే అవుట్ మీదుగా సుమారు 10 కిలో మీటర్ల దూరం వెళ్తే కోనకు చేరుకోవచ్చు. అలాగే ఏర్పేడు మండలం చెల్లూరు మీదుగా 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే సదాశివకోన వస్తుంది. ఈ మార్గంలో మధ్యలో యాత్రికుల కోసం జీపు, బస్సు తిరుగుతుంటాయి. ప్రతి పౌర్ణమి రోజు పర్యాటకుల కోసం వాహనాలు సిద్ధంగా ఉంటాయి. అలాగే ద్విచక్రవాహనంలోనూ వెళ్లవచ్చు. చెన్నై నుంచి కనకమ్మసత్రం మీదుగా వచ్చే తమిళనాడు యాత్రికులు నారాయణవనం మండలం నగిలేరి మీదుగా అడవి మార్గంలో సుమారు 12 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే సదాశివ కోన వస్తుంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఒంటరిగా వెళ్లడం కంటే 10 మంది కలిసి వెళ్లడం మంచిదని స్థానికులు చెబుతున్నారు.



సదాశివకోనకు వెళ్లే కాలిబాట



కోనకు వెళ్తున్న యువకులు



కోనకు వెళ్లే మార్గంలో పెద్ద చెట్టు